ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 జనగామ
గురువారం 6 జూన్ 2024



అధికారులు, అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్లను కట్టలు కడుతున్న సిబ్బంది

నాటికీ.. నేటికీ..

ఆరునెలల్లో ఓటరు నాడి మారింది. అందుకు ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ ప్రజలు ఇచ్చిన తీర్పు నిదర్శనంగా కనిపిస్తోంది. హోరాహోరీగా సాగిన లోక్‌సభ ఎన్నికల సమరంలో ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టినా.. అనేక చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు చేజారటంతో కేడర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఓ వైపు మంత్రి కొండా సురేఖ ప్రాతినిథ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఓట్ల ఆధిక్యం రావడం.. మరో వైపు బీజేపీ అభ్యర్థి సొంత నియోజకవర్గంలో హస్తం పార్టీ ఆధిక్యత సాధించడం లాంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ఇక ఈ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా పుంజుకుంది. పట్టణ ఓటర్లు ఆ పార్టీ వైపే మొగ్గు చూపారు. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌కు జై కొట్టారు. అలాగే మూడు పర్యాయాలు వరుసగా గెలిచి వరంగల్‌ను కంచుకోటగా మార్చుకున్న బీఆర్ఎస్ ఈసారి తీవ్ర నష్టాన్ని మూటగట్టుకుంది. పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రెండోస్థానంలో నిలువగా, మిగిలిన ఐదు చోట్ల మూడో స్థానానికి దిగజారింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్







'లోక్‌సభ' పరీక్షలో మంత్రులు ఫెయిల్!


- ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు
- మెదక్‌లో కొండా సురేఖ, ఆదిలాబాద్‌లో సీతక్క, కరీంనగర్‌కు పొన్నం, పెద్దపల్లిలో దుద్దిళ్ల..
- శ్రీధర్‌బాబు మినహా ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఓటమి

వివరాలు : 7లో..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

- వరంగల్ లోక్‌సభ పరిధిలో కాంగ్రెస్‌కు తగ్గిన ఓటు బ్యాంకు
- అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్‌సభకు 80వేల పైచిలుకు ఓట్ల వ్యత్యాసం
- వరంగల్ తూర్పులో మంత్రి కొండాకు షాక్.. బీజేపీకి జై కొట్టిన జనం
- కమలం వైపు చూసిన అర్బన్ ఓటర్లు
- బీజేపీ అభ్యర్థి అరూరి సొంత సెగ్మెంట్‌లో హస్తానికి ఆధిక్యం
- కంచుకోటలో మూడోస్థానానికి పరిమితమైన 'గులాబీ' పార్టీ
- పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్ మినహా ఐదు నియోజకవర్గాల్లో మూడోస్థానం
- వరంగల్ అర్బన్‌లో మరీ దారుణం.. 20వేల ఓట్లకే పరిమితం

7





6

మానుకోటలో కాంగ్రెస్ జోష్

- లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం
- ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

వరంగల్ లోక్‌సభ నియోజకవర్గంలో.. ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
2023 అసెంబ్లీ	6,63,556	1,56,638	5,03,298
లోక్‌సభ	5,81,294	3,60,955	2,32,033

మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో.. ఎన్నికలు	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
2023 అసెంబ్లీ	6,85,897	34,431	4,43,910
లోక్‌సభ	6,12,774	1,10,444	2,63,609

'పట్టభద్రుల' ఫలితంపై ఉత్కంఠ

- ప్రారంభమైన వరంగల్, నల్లగొండ, ఖమ్మం ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు
- నల్లగొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న ప్రక్రియ
- మొత్తం 96టేబుళ్ల ఏర్పాటు.. ఒక్కో టేబుల్‌లో వెయ్యి ఓట్ల లెక్కింపు
- ప్రతీ రౌండ్‌లో 96వేల ఓట్ల కౌంటింగ్



కౌంటింగ్ కేంద్రం వద్ద తీన్మార్ మల్లన్న, రాకేష్ రెడ్డి కరచాలనం

నల్లగొండ, జూన్ 5: పార్లమెంట్ ఫలితాలు రావడంతో.. ఇక అందరి దృష్టి వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితంపై పడింది. ఈ స్థానానికి జరగిన ఉపఎన్నికలో భాగంగా గత నెల 27న బ్యాలెట్ పద్ధతిన పోలింగ్ జరగ్గా.. పట్టభద్రులు ఏ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టబోతున్నారా అన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. మొత్తం 52మంది అభ్యర్థులు పోటీ చేయగా.. 4.63లక్షల ఓట్లకు గాను 3.36లక్షలకు పైగా ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్ల లెక్కింపు ప్రక్రియ బుధవారం నల్లగొండ జిల్లా కేంద్ర సమీపంలోని అనిశెట్టిదుప్పలపల్లి గోదాముల్లో ప్రారంభమైంది. ఉదయం 8గంటలకు నల్లగొండ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన పర్యవేక్షణలో లెక్కింపును ప్రారంభించిన అధికారులు, సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం 4గంటల వరకు 25బ్యాలెట్ల చొప్పున బండిల్స్‌ను కట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. మొత్తం 96టేబుళ్లను ఏర్పాటు చేసి.. ఒక్కో టేబుల్‌పై 1000ఓట్ల లెక్కన, ప్రతీ రౌండ్‌లోను 96వేల ఓట్లను కౌంట్ చేయనున్నారు. అయితే నాలుగు రౌండ్లలో తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు పూర్తవనుంది. అర్ధరాత్రి దాటిన తరువాతే తొలి ప్రాధాన్యత ఓట్లపై స్పష్టత రానుంది. ఒకవేళ తొలి ప్రాధాన్యత ఓట్లద్వారా ఫలితం తేలకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లు, అప్పటికీ ఫలితంపై స్పష్టత రాకపోతే మూడో ప్రాధాన్యత ఓట్లను లెక్కిస్తారు. ఇక విజేత ఎవరనేది తేలడానికి రెండు రోజుల సమయం పట్టనుంది. ఎస్పీ చందన దీప్తి బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. పోలీస్‌శాఖలోని అన్ని ర్యాంకులకు చెందిన 800మంది సిబ్బందితో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. కౌంటింగ్ హాళ్ల వద్ద డీఎస్పీ ర్యాంకు అధికారులు బందోబస్తును పరిశీలిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డితో పాటు ఇతర అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రాల్లోనే ఉండి సరళిని తెలుసుకుంటున్నారు.



కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నల్లగొండ కలెక్టర్

జిల్లాలో పలుచోట్ల వర్షం

జనగామ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. లింగాలఘణపురంలో 19.8 మి.మీ మోస్తరు వర్షం పడగా మిగతా చోట్ల స్వల్ప వర్షం పడింది. కొడకండ్లలో 9.3 మి.మీ, పాలకుర్తిలో 3.8 మి.మీ, తరిగొప్పులలో 1.5 మి.మీ, దేవరుప్పులలో 1.3 మి.మీ, పాలకుర్తి మండలం గూడూరులో 0.8 మి.మీ వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ తెలిపింది.

మహిళ మృతి కేసులో ముగ్గురి రిమాండ్

రఘునాథపల్లి, జూన్ 5: మహిళా రైతుపై ట్రాక్టర్ ట్రాలీ పడి మృతి చెందిన కేసులో పోలీసులు బుధవారం ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం నాడు రఘునాథపల్లి మండలం ఆంధ్రతండాకు చెందిన ధరావత్ బిల్యా, శేనాద్రి వారి వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు దారి కోసం మట్టి పోస్తున్న క్రమంలో పక్కనే ఉన్న భూక్య గణేష్ భూమి లో పడింది. దీంతో గణేష్‌తో పాటు అతడి భార్య మంగమ్మ అక్కడకు వెళ్లి "మీకు ఇక్కడి నుంచి దారి లేదు.. మట్టి పోయడానికి వీలు లేదు" అంటూ గొడవకు దిగారు. ఈ క్రమంలో బిల్యా కుమారుడు రవీందర్, శేనాద్రి అతని భార్య కాశి ముగ్గురు కలిసి మంగమ్మను నెట్టివేయడంతో కింద పడిపోయింది. అదే సమయంలో బిల్యా ట్రాక్టర్ నడుపుతుండగా రాయిపైకి ఎక్కిన ట్రాలీ మంగమ్మ పైన పడడంతో అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మంగమ్మ మృతికి కారకులైన బిల్యా, శేనాద్రి, కాశిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బిల్యా కుమారుడు రవీందర్ పరారిలో ఉన్నాడని ఎస్ఐ నరేష్ తెలిపారు.

ఐసెట్ ప్రశాంతం



వరంగల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలోకి వెళుతున్న విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5: 2024-25 విద్యా సంవత్సరానికి ఎంబీఏ, ఎంసీఏ ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-2024 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కన్వీనర్ ఆచార్య ఎస్.నరసింహాచారి తెలిపారు. మొదటి సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ఎంపిక చేసిన 115 పరీక్షా కేంద్రాల్లో మొత్తం 28,931 విద్యార్థులకు 25,982 మంది హాజరైనట్లు తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో 116 పరీక్ష కేంద్రాల్లో 28,969 విద్యార్థులకు 26,298 హాజరైనట్లు పేర్కొన్నారు. జూన్ 6వ తేదీన ఉదయం సెషన్‌తో ప్రవేశ పరీక్ష పూర్తవుతుందన్నారు. వరంగల్ రీజియన్‌లోని వరంగల్, నర్సంపేటలోని 8 సెంటర్లలో బుధవారం ఉదయం మొదటి సెషన్‌లో మొత్తం 1,554 మంది విద్యార్థులకు 1,446 మంది హాజరు కాగా, మధ్యాహ్నం జరిగిన రెండో సెషన్‌లో 1,554 మంది విద్యార్థులకు 1,462 మంది విద్యార్థులు హాజరైనట్లు వివరించారు.



నర్మెటలో పత్తి సాగు కోసం అచ్చు కొడుతున్న రైతు

సాగుబాట

- జిల్లాలో జోరందుకున్న వ్యవసాయ పనులు
- తొలకరి వర్షాలకు ముందే పత్తి సాగులో రైతులు నిమగ్నం
- వరి నారు పోస్తున్న అన్నదాతలు
- జిల్లాలో 3.70 లక్షల ఎకరాల్లో సాగు అంచనా

జనగామ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వానాకాలం సాగు సందడి మొదలైంది. తొలకరి వర్షాలు పలకరించకముందే రైతన్నలు సాగు సంబురంలో మునిగిపోయారు. జిల్లా అంతటా రైతులు దుక్కుల్ని సిద్ధం చేసుకోవడంతో పాటు చాలా చోట్ల పత్తి సాగును కూడా మొదలు పెట్టారు. ఇటీవల జిల్లాలో మోస్తరు వర్షాలు కురవడంతో పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో సాగులో నిమగ్నమయ్యారు. దుక్కులు దున్నేందుకు అనుకూలంగా వర్షాలు కురియడంతో రైతులు అంతా చెలకల బాట పట్టారు. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో 3.70 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అందుకు తగ్గట్టుగా విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచారు.

అన్నదాతల బిజీ బిజీ..

వానాకాలం సీజన్ ప్రారంభం కావడంతో కుటుంబంలోని పిల్లాజెల్లా అంతా కలిసి విత్తనాలు వేసే పనిలో మునిగిపోయారు. విత్తనాలు, ఎరువుల దుకాణాలు రద్దీగా మారిపోయాయి. వరి, పత్తి, కంది, వేరుశనగ వంటి పంటల కోసం దుక్కు లు సిద్ధం చేసుకుంటున్నారు. చాలా చోట్ల దుక్కులు పూర్తి కాగా.. పత్తి విత్తనాలు పెట్టే పనులు జోరుగా సాగుతున్నాయి. ముందస్తుగా దుక్కులు చేసి పెట్టుకున్న వారు విత్తడం ప్రారంభించారు. మిగతా రైతులు దుక్కులు సిద్ధం చేసుకునే పనిలో ఉన్నారు. వరి సాగు కోసం జిల్లాలో నారు పోయడం ప్రారంభమైంది. రైతులు విత్తనాల కోసం ఫర్టిలైజర్ దుకాణాలకు పరుగులు తీస్తున్నారు.

సాగుకు సరిపడా వర్షాలు పడడంతో..

జిల్లాలో పత్తి, కంది వంటి ఆరుతడి పంటల సాగుకు సరిపోను వర్షాలు ఇటీవల కురిశాయి. నెల రోజుల్లో జిల్లా అంతటా మోస్తరు వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలతో అన్నదాతలు దుక్కులను సిద్ధం చేసుకున్నారు. దుక్కుల్లో తేమశాతం ఉండడంతో పత్తి గింజలు పెడుతున్నారు. ముందస్తుగా పత్తి గింజలు పెడితే వర్షాలు సకాలంలో పడకపోతే ఎండిపోయి మొలకెత్తే అవకాశం ఉండదు. కానీ వర్షాలు సకాలంలోనే వచ్చే అవకాశం ఉందని భావించిన రైతులు పెద్ద సంఖ్యలో పత్తి సాగులో తలమునకలైపోయారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 50 శాతానికి పైగా పత్తి సాగు పూర్తయినట్లు తెలుస్తోంది.

జిల్లాలో 3.70 లక్షల ఎకరాల్లో..

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా అన్ని రకాల పంటలు కలిపి 3.70 లక్షల ఎకరాల్లో సాగు అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో వరి పంట 2.10 లక్షల ఎకరాల్లో, పత్తి 1.45 లక్షల ఎకరాల్లో, కందులు 10 వేల ఎకరాల్లో, ఇతర పంటలు 5 వేల ఎకరాల్లో సాగవుతాయని భావిస్తున్నారు. గత ఏడాది వానాకాలం సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3.76.625 ఎకరాల్లో

మిగతా 8వ పేజీలో...

వానాకాలం సీజన్‌లో పంటల సాగు అంచనా విస్తీర్ణం(ఎకరాల్లో)

పంట	ఎకరాలు
వరి	2.10 లక్షలు
పత్తి	1.45 లక్షలు
కంది	10 వేలు
ఇతర పంటలు	5 వేలు
మొత్తం	3.70 లక్షలు



నర్మెటలో పత్తి విత్తనాలు పెడుతున్న మహిళలు

మొక్కల పెంపకంతో జీవరాశి పరిరక్షణ

- జిల్లా జడ్జి రవీంద్రశర్మ



జనగామ కోర్టు ఆవరణలో మొక్కలు నాటుతున్న జిల్లా జడ్జి రవీంద్రశర్మ

జనగామ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చెట్లను పెంచడం ద్వారా భూమిపై ఉన్న జీవరాశిని పరిరక్షించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్రశర్మ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టులో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెట్లను పెంచడం వల్ల గాలి కాలుష్యంతో పాటు ఉష్ణోగ్రత తగ్గుతుందన్నారు. పండ్ల చెట్లను పెంచడం వల్ల వాటిపై ఆధారపడే పక్షులు, జంతువులు మనుగడ సాధిస్తాయన్నారు. ప్రకృతిలో కొన్ని ప్రాణులను బతికించిన వాళ్లమవుతామన్నారు. ప్రతీ ఒక్కరు మొక్కల పెంపకాన్ని బాధ్యతగా చేపట్టాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ వెంకట్రామనర్సయ్య, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి..

ఈనెల 8న జిల్లా కోర్టులో జరిగే లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా జడ్జి రవీంద్రశర్మ సూచించారు. దీనికి సంబంధించి న్యాయవాదులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో ఎక్కువ మొత్తంలో కేసులు పరిష్కారం అయ్యేలా న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుచరిత, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సందీప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రరుషి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మొక్కలు నాటడం అలవాటుగా మారాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్‌రాజ్

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన అధికారులు

8లో..

మానుకోటలో కాంగ్రెస్ జోష్

● లోక్‌సభ ఎన్నికల్లో పదేళ్ల తర్వాత విజయం ● ఇక స్థానిక ఎన్నికలకు సై అంటున్న కేడర్

మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పదేళ్లుగా బీఆర్ఎస్ కంచుకోటగా ఉన్న మహబూబాబాద్ (మానుకోట) పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ మళ్లా పాగా వేసింది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఉత్సాహాన్ని కొనసాగిస్తూ ఓటర్లు కాంగ్రెస్‌కు జై కొట్టారు. దీంతో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు జోష్‌లో ఉండగా.. ఇదే ఉత్సాహంతో రానున్న మునిసిపాలిటీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, గ్రామపంచాయతీలు, సహకార సంఘాల ఎన్నికలకు తామంతా సై అన్నట్టుగా అధిష్ఠానానికి సంకేతాలిస్తున్నారు. జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు మునిసిపాలిటీలు ఉండగా 18 మండలాల్లో జడ్పీటీసీలు, ఎంపీటీసీలతో పాటు 461 సర్పంచ్ స్థానాలున్నాయి. వీటిపై తిరిగి పట్టు సాధించేందుకు ఇప్పటి నుంచే గ్రామాలను శాసించే నాయకుల కోసం ముఖ్యనేతలు అన్వేషణ ప్రారంభించారు. తమతమ గ్రామాలు, పోలింగ్ బూత్‌లలో ఏ పార్టీకి ఎన్నిఓట్లు పోలయ్యాయి అనేది తెలుసుకునే దిశగా గణాంకాలు సేకరిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు.

బీఆర్ఎస్‌ను కంగుతినిపించిన ఓటర్లు

పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్‌పై ఉన్న అసంతృప్తి, మార్పు కావాలన్న ఆకాంక్ష నేపథ్యంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క భద్రాచలం మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల్లో గులాబీ దండును కంగుతినిపించారు. దాని నుంచి తేరుకునే లోపే వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా ప్రజలు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో భద్రాచలం మినహా.. ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాకల్లో కాంగ్రెస్ విజయదుందుభి మోగించింది. ఆ తర్వాత రాజకీయ పరిణామాల్లో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు కూడా కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పూర్తి పార్లమెంట్ నియోజకవర్గం హస్తం చేతిలోకి వెళ్లిపోయింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ఏడు సెగ్మెంట్ల పరిధిలో కాంగ్రెస్‌కు 1,09,171 ఓట్లు రాగా, బీఆర్ఎస్‌కు 4,43,910 ఓట్లు, బీజేపీకి కేవలం 34,431 ఓట్లు పోలయ్యాయి. ఈ లెక్కలను బేరీజు వేసుకున్న బీజేపీ వ్యూహాత్మకంగా గతంలో బీఆర్ఎస్ ఎంపీగా పనిచేసిన ప్రొఫెసర్ అజ్మీరా సీతారాంనాయక్‌కు గాలం వేసి, పార్టీలో చేర్చుకుని ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిపింది. బీఆర్ఎస్ నుంచి సిట్టింగ్ ఎంపీ మాలోతు కవితనే మరోమారు రంగంలో దిగగా.. కాంగ్రెస్ పదేళ్ల క్రితం ఇక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించి కేంద్ర మంత్రిగా పనిచేసిన పోరిక బలరాంనాయక్‌నే అభ్యర్థిగా దించింది. ఆయన గత రెండు పర్యాయాలు ఓటమి పాలైనప్పటికి మూడోసారి ఆయనకే తిరిగి అవకాశం ఇచ్చింది. ప్రస్తుత పరిణామాల్లో పార్లమెంట్ ఓటర్లు కాంగ్రెస్‌కే పట్టం కట్టారు. మానుకోట పార్లమెంట్ పరిధిలో మొత్తం 15,32,366ఓట్లు ఉండగా 11,01,030ఓట్లు పోలయ్యాయి. అందులో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ 6,12,774ఓట్లు సాధించి 3,46,089 మెజారిటీతో విజయం సాధించారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి మాలోతు కవిత 2,63,609 ఓట్లతో రెండోస్థానం, బీజేపీ అభ్యర్థి అజ్మీర సీతారాంనాయక్ 1,10,444ఓట్లతో మూడోస్థానంలో నిలిచారు. ఈ లెక్కల ప్రకారం గత పార్లమెంట్ ఎన్నికల నాటిని నేటికి కాంగ్రెస్ బలం భారీగా పెరగ్గా.. బీఆర్ఎస్ గ్రాఫ్ తీవ్రంగా పడిపోయింది. ఇక బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోగలిగింది.

జోష్‌లో హస్తం శ్రేణులు

లోక్‌సభ ఎన్నికల్లో మహబూబాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ శ్రేణులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లో వరించిన గెలుపు ఉత్సాహంతో మున్ముందు వరుసగా జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తహతహలాడుతున్నారు. పోలింగ్ బూత్‌లు, గ్రామాల వారీగా ఓటింగ్ సరళిని బేరీజు వేసుకుంటూ రెడీ టు ఫైట్ అంటున్నారు.

మానుకోట లోక్‌సభలో పోలైన ఓట్లు

అసెంబ్లీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్	95306	50293	9884
మహబూబాబాద్	102011	52128	17684
ఇల్లందు	92957	33658	12494
పినపాక	77430	28111	15170
భద్రాచలం	53637	19406	10294
ములుగు	86825	33592	19029
నర్సంపేట	100339	45228	24220
పోస్టల్ ఓట్లు	4269	1193	1669
మొత్తం	**6,12,774**	**2,63,609**	**1,10,444**

2023 అసెంబ్లీ ఎన్నికల్లో..

నియోజకవర్గం	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
డోర్నకల్	1,15,587	62,456	1,817
మహబూబాబాద్	1,16,644	66,473	17,038
ఇల్లందు	1,09,177	51,862	2566
పినపాక	90,510	56,004	2627
భద్రాచలం	47,533	53,252	1931
ములుగు	1,02,267	68,567	5388
నర్సంపేట	1,04,185	85,296	3062
మొత్తం	**6,85,897**	**4,43,910**	**34,431**

ముఖ్యమంత్రిని కలిసిన డీసీసీబీ చైర్మన్



హనుమకొండ సిటీ, జూన్ 5: వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. డీసీసీ బ్యాంక్ నిర్వహణ, ప్రగతి తదితర అంశాలను ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి తెలియ చేశారు.

‘లోక్‌సభ’ పరీక్షలో మంత్రులు ఫెయిల్!

● ఇన్‌చార్జ్‌లుగా పొరుగుజిల్లాల్లో ఓరుగల్లు నేతల బాధ్యతలు ● ముగ్గురు మంత్రుల నియోజకవర్గాల్లో బీజేపీ గెలుపు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లోక్‌సభ ఎన్నికల రూపంలో వచ్చిన పరీక్షలో కాంగ్రెస్ మంత్రులు ఫెయిల్ అయ్యారన్న చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎంతో నమ్మకంతో పొరుగు జిల్లాల్లో ఎంపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతలు అప్పగించారు. దీంతో మంత్రులు సొంత నియోజకవర్గాలను వదిలి ఆయా లోక్‌సభ కేంద్రాల్లో విస్తృతంగా పర్యటించినా ఫలితం లేకుండా పోయింది. వరంగల్‌లో సీనియర్ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తొలుత లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కడియం కావ్య అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో అనూహ్యంగా ఆమెను వరంగల్ బాధ్యతల నుంచి తప్పించి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి ఆ బాధ్యతలను కాంగ్రెస్ అధిష్ఠానం అప్పగించింది. ఈ క్రమంలో అప్పటికే మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిగా ఉన్న సురేఖకు మెదక్ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా ఇచ్చారు. దీంతో సురేఖ లోక్‌సభ ఎన్నికల రాజకీయ వ్యూహాలపై దృష్టిపెట్టారు. అయినప్పటికీ మెదక్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ఓటమిపాలయ్యారు. పైగా తన సొంత నియోజకవర్గం వరంగల్‌తూర్పులో బీజేపీకి ఆధిక్యం వచ్చింది.



అలాగే ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించడంతో ఆమె మూడు నెలలుగా ములుగు కంటే ఆదిలాబాద్‌లోనే ఎక్కువగా మకాం వేశారు. ఆదివాసీల ఓట్లు అధికంగా ఉండటంతో సీతక్క తన చరిష్మాతో ఆదివాసీ ఓట్లను కాంగ్రెస్‌కు మళ్లించి, పార్టీని గెలిపిస్తుందనే ఆశతో సీతక్కకు ఆదిలాబాద్ లోక్‌సభ బాధ్యతలను అప్పగించినా అక్కడ కూడా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమిపాలయ్యారు. అలాగే హనుమకొండ జిల్లా పరిధిలోని హుస్నాబాద్ ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇవ్వటంతో పాటు పొన్నం సూచించిన వ్యక్తికే టికెట్ పార్టీ ఇచ్చింది. అయినా కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో పొన్నం కూడా పార్టీ పెట్టిన తొలి పరీక్షలో ఫెయిల్ అయ్యారనే చర్చ జరుగుతోంది. ఇక భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామానికి చెందిన మంథని ఎమ్మెల్యే, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు పెద్దపల్లి లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగించగా... ఇక్కడ మాత్రమే కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే ఓరుగల్లు పరిధిలో ఉన్న నలుగురు మంత్రులకు కాంగ్రెస్ అధిష్ఠానం లోక్‌సభ ఎన్నికల బాధ్యతలను అప్పగిస్తే ముగ్గురు మంత్రులు ఆశించిన స్థాయిలో రాణించలేదనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది.

నాటికీ.. నేటికీ..

ఆరునెలల్లో మారిన ఓటరు నాడి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

గతేడాది డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల నాటికి.. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల నాటికి ఓరుగల్లు ఓటరు ఆలోచనలో వచ్చిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. రాష్ట్ర, జాతీయ, స్థానిక రాజకీయ, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుంటున్న ఓటర్లు అనూహ్యమైన రీతిలో నిర్ణయాలు తీసుకుంటున్నారనడానికి లోక్‌సభ పోరులో పార్టీలకు ఇచ్చిన ఓటు బ్యాంకును పరిశీలిస్తే అర్థమవుతోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా పోటాపోటీగా సాగిన పార్లమెంట్ పోరులో వరంగల్ స్థానం ‘చేతి’కి చిక్కినా.. చాలా చోట్ల ఆ పార్టీ ఓటు బ్యాంకు తగ్గిపోవడం శ్రేణుల్లో కలవరం రేపుతోంది. ఇక మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీజేపీకి ఆధిక్యం రావడం.. బీజేపీ అభ్యర్థి అరూరిరమేష్ సొంత నియోజవర్గంలో కాంగ్రెస్‌కు ప్రజలు జై కొట్టడం లాంటి పరిణమాలు ప్రస్తుతం తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం పెరగ్గా.. పట్టణ ఓటర్లు ఆ పార్టీని ఆదరించినట్లు అర్థమవుతోంది. గ్రామీణ ఓటర్లు మాత్రం కాంగ్రెస్‌వైపే నిలవగా.. వరుసగా మూడు సార్లు వరంగల్‌పై జెండా ఎగరవేసిన బీఆర్ఎస్ ఈసారి చతికిలపడింది. రెండు అసెంబ్లీ స్థానాల్లో ద్వితీయస్థానం పొంది.. ఐదు నియోజకవర్గాల్లో తీవ్రంగా దెబ్బతిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఓటర్లు ‘చే’జారినా.. విజయం కాంగ్రెస్‌దే..

కాంగ్రెస్ విజయయాత్ర కొనసాగిస్తోంది. 2023 నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, పది చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులే ఎమ్మెల్యేలుగా విజయం సాధించారు. స్టేషన్‌ఘనపూర్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలచిన కడియం శ్రీహరి సైతం కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేల బలం పెరిగింది. ఇదే క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పట్టు సాధించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 6,63,556 ఓట్లు పోలయ్యాయి. అయితే లోక్‌సభ ఎన్నికల్లో 5,81,294ఓట్లు వచ్చాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లతో పోల్చితే 82,262 ఓట్లు తగ్గాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నుంచి 1,06,690 ఓట్లు వస్తే ఈసారి 94,238 ఓట్లు వచ్చాయి. సుమారు 12వేల ఓట్లు తగ్గాయి. అలాగే భూపాలపల్లి నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో 1,23,116 ఓట్లు కాంగ్రెస్ వస్తే, ఎంపీ ఎన్నికల్లో 89,463 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. సుమారు 36వేలకు పైగా ఓట్లకు కోత పడింది. అలాగే పాలకుర్తిలో గతఎన్నికల్లో 1,26,848 కాంగ్రెస్‌కు పోలయితే ఈసారి కేవలం87,293 ఓట్లే పోలయ్యాయి. ఇక్కడ కూడా 38వేల ఓట్ల తగ్గాయి. మిగతా చోట్ల కూడా ఓట్లకు కోత పడింది. పరకాల, స్టేషన్‌ఘనపూర్‌లో కొంత ఓటింగ్ కాంగ్రెస్‌కు పెరిగింది. అయినప్పటికి కాంగ్రెస్ పార్టీ అంచనాలకు మించి 2.20లక్షల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య విజయం సాధించారు. ఈ గెలుపుతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేడర్ జోష్‌గా పని చేసే అవకాశం లభించిందని కాంగ్రెస్ సీనియర్ నేతలు పేర్కొంటున్నారు.

వరంగల్ తూర్పులో మంత్రికి షాక్..

లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్‌తూర్పు నియోజకవర్గం చర్చనీయాంశంగా మారింది. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో బీజేపీకి మెజార్టీ ఓట్లు పోలవ్వటం హాట్ టాపిక్‌గా మారింది. తూర్పు నియోజకవర్గంలో 7,954ఓట్ల ఆధిక్యాన్ని బీజేపీ కనపర్చడం చర్చనీయాంశంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కొండా సురేఖకు 67,757ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రదీప్‌రావుకు 52,105ఓట్లు పోలయ్యాయి. 15,652 ఓట్ల మెజార్టీతో కొండా సురేఖ విజయం సాధించారు. అయితే ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 66,627ఓట్లు పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లకంటే 1,130ఓట్లు తగ్గాయి. అయితే బీజేపీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో 52,105 ఓట్లు మాత్రమే పోలయితే, ప్రస్తుతం 74,581ఓట్లు పోలయ్యాయి. 22,476ఓట్లు అధికంగా బీజేపీ రాబట్టుకుని, వరంగల్ తూర్పులో కాంగ్రెస్‌ను రెండోస్థానానికి పరిమితం చేసింది.

అనూహ్యంగా పుంజుకున్న కమలం

వరంగల్ లోక్‌సభ పరిధిలో బీజేపీ భారీగా పుంజుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 1,56,638 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి అనుహ్యంగా 3,60,955ఓట్లు పోలయ్యాయి. అంటే 2,04,317 ఓట్లు అత్యధికంగా పెరిగాయి. అర్బన్ ఓటర్లు కూడా బీజేపీ వైపే మొగ్గు చూపారు. వరంగల్‌తూర్పులో కాంగ్రెస్‌ను దాటేసి ఓట్లను ఆధిక్యాన్ని సాధించింది. వరంగల్ పశ్చిమలో కూడా కాంగ్రెస్‌కు దీటుగా ఓట్లను పొందింది. పాలకుర్తి నియోజకవర్గంలో బీజేపీకి సరైన క్యాడర్ లేకపోవటంతో ఇక్కడ మూడోస్థానానికి పరిమితమైంది. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో పాలకుర్తిలో కేవలం 2,982 ఓట్లే రాగా, ఈ ఎన్నికలో 28,452 ఓట్లను రాబట్టింది. భూపాలపల్లిలో కూడా అనూహ్యంగా బీజేపీ పుంజుకుంది. ఇక్కడ గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 14731 ఓట్లే పోలయితే, ఈ ఎన్నికలో 49,631 ఓట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. పరకాలలో కూడా భారీగా ఓట్లను బీజేపీ సాధించింది. పాలకుర్తి సహా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి భారీగా ఓట్లు క్రాస్ అయ్యాయి.

వర్ధన్నపేటలో అరూరికి ఝలక్..

బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు తన సొంత నియోజకవర్గ ఓటర్లు ఝలక్ ఇచ్చారు. 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన అరూరి రమేష్ 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అయితే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రమేష్‌కు 87,238 ఓట్లు పోలవగా.. ప్రస్తుత ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా నిలిచిన ఆయనకు కేవలం 55,427 ఓట్లు మాత్రమే పోలయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల నాటికి.. ఇప్పటికి రమేష్‌కు 31,811ఓట్లు తగ్గటం చర్చనీయాంశంగా మారింది. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 94,638ఓట్లు పోలయ్యాయి.

‘కారు’ పరిస్థితి మరీ దారుణం..

వరంగల్ లోక్‌సభ స్థానంలో 2014 నుంచి వరుసగా మూడు పర్యాయాలు గెలిచిన బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో మరింత దారుణంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లో కలిపి బీఆర్ఎస్‌కు 5,03,298ఓట్లు పోలవగా.. ఈ ఎంపీ ఎన్నికల్లో కేవలం 2,32,033 ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే సుమారు 2,71,265ఓట్లు ఆ పార్టీకి దూరమయ్యాయనే లెక్కలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించినా బీఆర్ఎస్ మూడో స్థానానికి పరిమితం కావటం గులాబీ కేడర్‌ను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. వరంగల్ నగరంలోని వరంగల్ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్‌కు 20వేల ఓట్లు కూడా పోలవ్వలేదు. అలాగే భూపాలపల్లి, పరకాలలో గత అసెంబ్లీ ఎన్నికల్లో భారీగా ఓట్లు పొంది రెండోస్థానంలో నిలిచిన బీఆర్ఎస్ ఈ ఎన్నికలో నామమాత్రంగా పోటీ ఇవ్వడంపై కార్యకర్తల్లో ఆందోళన కనిపిస్తోంది. అయితే పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్‌లలో మాత్రమే బీఆర్ఎస్ రెండోస్థానంలో నిలిచింది. బీఆర్ఎస్ ఓటు బ్యాంకు చాలా వరకు బీజేపీకి, అక్కడక్కడ కాంగ్రెస్‌కు క్రాస్ అయిందనే చర్చ జరుగుతుండగా.. మొత్తానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్‌కు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

లోక్‌సభ ఎన్నికలో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
స్టేషన్‌ఘనపూర్	98,145	40,332	43,720
పాలకుర్తి	87,293	28,452	47,878
పరకాల	76,400	44,841	36,477
వరంగల్ పశ్చిమ	63,400	60,611	19,680
వరంగల్ తూర్పు	66,627	74,581	20,360
వర్ధన్నపేట	94,238	57,427	31,345
భూపాలపల్లి	89,463	49,631	31,360
పోస్టల్	5,728	5,080	1,213
మొత్తం	5,81,294	3,60,955	2,32,033

గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ పార్టీలకు పోలైన ఓట్లు

నియోజకవర్గం	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్
స్టేషన్‌ఘనపూర్	93,917	4,984	1,01,696
పాలకుర్తి	1,26,848	2,982	79,214
పరకాల	72,573	38,735	64,632
వరంగల్ పశ్చిమ	72,649	30,826	57,318
వరంగల్ తూర్పు	67,757	52,105	42,783
వర్ధన్నపేట	1,06,696	12,275	87,238
భూపాలపల్లి	1,23,116	14,731	70,417
మొత్తం	6,63,556	1,56,638	5,03,298

మొక్కలు నాటడం అలవాటుగా మారాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్‌రాజ్

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూన్ 5: పెరిగిపోతున్న భూతాపం తగ్గించడానికి ప్రతీఒక్కరు మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని, వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ హరీష్ రాజ్ సూచించారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్టేషన్ ఘన్‌పూర్ ప్రభుత్వ క్లస్టర్ ఆసుపత్రి సిబ్బంది ఆధ్వర్యంలో చేపట్టిన అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుట్టిన రోజు, పెళ్లి రోజు, అన్ని పండుగలకు ప్రతీ ఒక్కరు కనీసం ఐదు మొక్కలు నాటాలన్నారు. అంతేగాక ప్లాస్టిక్, పెట్రో ఉత్పత్తుల వాడకం తగ్గించడానికి ప్రయత్నించాలన్నారు. వ్యక్తిగత వాహనాల్లో కాకుండా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎక్కువగా వినియోగించాలన్నారు. తడి, పొడి చెత్త బుట్టలు వాడాలని, డ్రై డే పాటించాలని, అంటు వ్యాధులు రాకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు జనార్ధన్, సంధ్యారాణి, అజయ్‌కుమార్, సీహెచ్‌వో సాంబయ్య, ప్రభాకర్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: ఎంపీడీవో

కొడకండ్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీవో నాగశేషాద్రి సూరి అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆయన మండలకేంద్రంలో ఉపాధి పనులు జరుగుతున్న నాగులమ్మ కుంట వద్ద కూలీలకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి కాపాడాలని , చెట్లతో మనిషి జీవితం ముడిపడి ఉందని అన్నారు. చెట్లతో వాయు కాలుష్యం తగ్గడమేకాక సమయానికి వర్షాలు పడి పంటలు బాగా పండుతాయని అన్నారు. ఒక్కో వృక్షం ఆరు కుటుంబాలకు ఆక్సిజన్‌ను అందిస్తుందన్నారు. ఆయనతో పాటు ఏపీవో కుమారస్వామి, పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాస్, టీఏ యాకయ్య, ఎఫ్ఏ సురేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, కూలీలతో కలిసి మొక్కలు నాటారు.


స్టేషన్ ఘన్‌పూర్‌లో ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హరీష్‌రాజ్

మొక్కలు నాటిన పూర్వవిద్యార్థులు

లింగాలఘణపురం: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హైస్కూల్ ప్రారంభమై బుధవారం నాటికి 67 ఏళ్ల నిండటంతో ప్రపంచపర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణంలోని స్వామివివేకానంద పార్కులో పూర్వ విద్యార్థులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని పూర్వ విద్యార్థుల ఐక్యవేదిక ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులను నేర్పిన చదువులమ్మ చెంతన ప్రతీ విద్యార్థి బాధ్యతగా మొక్కను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కేమిడి భిక్షపతి, ఎడ్ల రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, పూర్వ విద్యార్థుల ఐక్యవేదిక ప్రతినిధులు కర్రె వీరయ్య, బొడ్డు వెంకన్న, చెన్నూరి మల్లేశం, వంగ మురళి, ఊడ్గుల భాగ్యలక్ష్మి, రాగళ్ల ఉపేందర్, బోయిని రమేశ్, ఓడపల్లి శ్రీధర్, వల్లపు కార్తీక్, గట్టగల్ల అనిల్, ఏదునూరి వీరయ్య, వంగ రాజు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

పాలకుర్తి: ప్రపంచ పర్యావరణం దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పాలకుర్తి, తొర్రూరు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాములు మాట్లాడుతూ భూమిపై ప్లాస్టిక్‌ను నియంత్రించే బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణాన్ని ప్రతీ ఒక్కరు పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సంధ్య, ఏఈపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శులు వెంకటాచారి, మహేష్, కొంరయ్య, ఆశ వర్కర్ శోభ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: బచ్చన్నపేటతో పాటు గ్రామాల్లో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. గ్రామాల్లో స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల బాధ్యుల ఆధ్వర్యంలో పచ్చదనం-పరిశుభ్రతతో పాటు పర్యావరణాన్ని కాపాడేందుకు పౌరుల బాధ్యతను వివరిస్తూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మొక్కలు నాటడం వల్ల కలిగే లాభాలను వివరించారు.


కొడకండ్లలో మొక్క నాటుతున్న ఎంపీడీవో నాగ శేషాద్రి సూరి


పాలకుర్తిలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో రాములు, ఇతర అధికారులు


లింగాలఘణపురంలో మొక్కలు నాటుతున్న పూర్వవిద్యార్థులు

టీడీపీ నాయకుల సంబరాలు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూన్ 5: ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అఖండ విజయం సాధించడం పట్ల స్టేషన్ ఘన్‌పూర్‌లో టీడీపీ సీనియర్ నేత జోగు కుమారస్వామి ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీ ఏపీలో తిరిగి అధికారంలోకి రావడం పార్టీకి, నాయకులు, కార్యకర్తలకు శుభ పరిణామమన్నారు. టీడీపీకి పూర్వ వైభవం వచ్చిందనడానికి ఇది నిదర్శనమన్నారు. తెలంగాణలో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. 30 ఏళ్లుగా పార్టీలోనే ఉంటున్నామని, ఇది మాకు ఎంతో సంతోషకరమైన విజయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతి కుమార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'స్టేషన్'లో వికసించిన కమలం

స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 5: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో ఓట్లు పోలయ్యాయి. గత నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలుచున్న గుండె విజయరామరావుకు కేవలం 4,984 ఓట్లు మాత్రమే వచ్చాయి. కాని, ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో అరూరి రమేష్‌కు 40,332 ఓట్లు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎంపీ ఎన్నికల్లో 35,348 ఓట్లు ఎక్కువ వచ్చాయి. దీంతో బీజేపీ శ్రేణుల్లో నూతనోత్తేజం వచ్చింది. ఎంపీ ఎన్నికల కంటే ముందు గ్రామాల్లో కేవలం టూ డిజిట్ నెంబర్‌కే పరిమితమైన ఓట్లు ఎంపీ ఎన్నికల్లో అనేక గ్రామాల్లో ఫోర్ డిజిట్స్ నెంబరుకు చేరుకున్నాయి. ఆరు నెలల వ్యవధిలోనే నియోజకవర్గంలో బీజేపీకి 10 రెట్ల ఓటు బ్యాంకు పెరిగింది. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రత్యమ్నాయ శక్తిగా బీజేపీ ఉండనుంది. వచ్చే ఐదేళ్లలో గ్రామాల వారీగా బీజేపీని మరింత పటిష్టం చేసి స్టేషన్‌లో కాషాయ జెండను ఎగురవేస్తామని బీజేపీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాడతాం

ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న నాయక్

జఫర్‌గడ్, జూన్ 5 : విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ పోరాటం సాగిస్తుందని ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న నాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న కార్పొరేట్ కళాశాలలను మూసివేయాలన్నారు. జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసి, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. ఇంటర్ విద్యార్థుల నుంచి లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న నారాయణ, శ్రీచైతన్య సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇంటర్ రీ వెరిఫికేషన్ ఉచితంగా చేసి, నమోదు చేసుకున్న విద్యార్థులకు ఫీజు వాపసు చేయాలన్నారు. ఇంటర్ విద్యలో నెలకొన్న సమస్యలపై ఈనెల 7వ తేదీన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'ఛలో ఇంటర్ బోర్డు ముట్టడి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నుంచి విద్యార్థులు, విద్యావంతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యాకన్న నాయక్ కోరారు. సమావేశంలో ప్రజా సంఘాల జిల్లా నేత రాపర్తి సోమయ్య, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు శ్రీకాంత్, అర్జున్, కళ్యాణ్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కిందపడి రైతుకు తీవ్ర గాయాలు

చిలుపూర్, జూన్ 5: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ రైతు గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుపూర్ మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన భూక్య దుర్గయ్య తన వ్యవసాయ భూమిని ట్రాక్టర్‌తో దున్నిస్తున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పిట్టల వెంకటయ్య ట్రాక్టర్‌ను రివర్స్ చేస్తుండగా, వెనకాలే ఉన్న భూక్య దుర్గయ్యను తాకడంతో కిందపడ్డాడు. అతడి చెయ్యి టైర్ కింద పడడంతో విరిగిపోయింది. వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఎస్సై ముత్యం రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో జారిపడి వృద్ధ రైతు మృతి

చిలుపూర్, జూన్ 5 : మండలంలోని దేశాయి తండా పరిధిలోని సీతా తండాలో ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు బుధవారం వ్యవసాయ బావిలో జారిపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భానోత్ గోవిందు (75) అనే వృద్ధ రైతు తన వ్యవసాయ బావి దగ్గర మోటార్ పెట్టేందు కని వెళ్ళాడు. స్టార్టర్‌ను ఆన్ చేస్తున్న క్రమంలో కాలు జారి బావిలో పడి ఊపిరాడక మృతిచెందాడు. మృత దేహాన్ని వరంగల్ ఎంజీఎంకు తరలించి, అతడి భార్య రాంకీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముత్యం రాజేందర్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, మృతుడు గోవిందుకు కొడుకు దూపతో పాటు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.


భానోత్ గోవిందు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

జఫర్‌గడ్, జూన్ 5 : మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన కోమటి రమేశ్ కుటుంబాన్ని బుధవారం కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. పేద కుటుంబం కావడంతో పార్టీ తరఫున రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ మొగిలిపాక నర్సింగం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

మడికొండ, జూన్ 5: కాజీపేట మండలం అమ్మవారిపేట శివారులోని భట్టుపల్లి నుంచి ఉర్సు గుట్ట వెళ్లే దారిలో గుర్తుతెలియని మహిళను దారుణంగా హత్య చేశారు. దుండగులు మహిళ తలపై బండరాయితో బాది హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మడికొండ ఇన్‌స్పెక్టర్ డి.ప్రతాప్ బుధవారం ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన అనంతరం ఎంజీఎం మార్చురీకి తరలించారు. ఆమె వయసు సుమారు 33 ఏళ్లు ఉంటుందని, త్వరలోనే ఈ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

సాగుబాట

(5వ పేజీ తరువాయి)

పంటలు సాగవుతాయని అంచనా వేశారు. అప్పుడు వరి 1.90 లక్షల ఎకరాలు, పత్తి 1.70 లక్షల ఎకరాల్లో సాగవుతుందని భావించారు. కాగా.. ఈసారి అంచనాలో మార్పులు చేశారు. వరి పంట అంచనా విస్తీర్ణం పెరిగి పత్తి అంచనా విస్తీర్ణాన్ని తగ్గించారు. ఈ సీజన్‌లో పంటల సాగుకు సంబంధించి 63 వేల క్వింటాళ్ల వరి విత్తనాలు, 4.35 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు, 400 క్వింటాళ్ల కంది విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసి విత్తనాలు తెప్పిస్తున్నారు.

ముందస్తు నాట్లే మేలు

వానాకాలం సీజన్‌లో వరి నాట్లను ముందస్తుగా వేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఇప్పటికిప్పుడు వరి నారు పోసుకొని ఆగస్టు నెల ప్రారంభం లోగా నాట్లు పూర్తి చేసుకోవాలని అంటున్నారు. దీని వల్ల వచ్చే యాసంగి సీజన్‌లోనూ నాట్లు త్వరగా వేయడానికి అవకాశం ఉంటుందని, దీని వల్ల వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో వచ్చే వడగళ్ల నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇందులో భాగంగా సన్న, దొడ్డురకాల్లో స్వల్పకాలంలో చేతికి వచ్చే రకాలను సాగుకు ఎంచుకోవడం ఉత్తమమని అంటున్నారు. సన్నరకంలో తెలంగాణ సోనా, దొడ్డురకాల్లో కేఎస్ఎం-118, ఎంటీయూ-1010, జేజీఎల్-24428 ఐఆర్-64 వంటి రకాలు 125 రోజుల్లోనే పంట చేతికి వస్తుందని అధికారులు చెబుతున్నారు. మిగతా రకాలు 135 నుంచి 145 రోజులకు పంట చేతికి వస్తాయని చెబుతున్నారు. వరి వేసే రైతులు పచ్చిరొట్ట లేదా జనుములు, పెసర్ల వంటి వాటిని పొలాల్లో చల్లి నాటు వేసే ముందు బాగా కలియ దున్నాలని సూచిస్తున్నారు. పచ్చిరొట్ట విత్తనాలు దొరకని పక్షంలో పెసర్లు ఎకరానికి 8-12 కిలోల చొప్పున చల్లుకొని పూత వచ్చిన తర్వాత దున్నుకోవాలని అంటున్నారు.

పత్తిలో అంతర పంటగా కంది

పత్తిలో అంతర పంటగా కంది సాగు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఎర్ర నేలల్లో అయితే నాలుగు, ఐదు పత్తి సాళ్లకు ఒక కంది సాలు, నల్లరేగడి నేలల్లో అయితే ఎనిమిది పత్తి సాళ్లకు ఒక కంది సాలును వేసుకోవాలని అంటున్నారు. ఏదైనా వర్షాభావ పరిస్థితులు ఎదురైతే ఏదో ఒక పంట చేతికి వచ్చే అవకాశం ఉంటుందని, వర్షాలు సమృద్ధి పడితే రెండు పంటలూ చేతికి వస్తాయని చెబుతున్నారు. అదేవిధంగా జిల్లాలో పప్పు దినుసుల సాగుకు అనుకూల వాతావరణం ఉన్నందున కంది, పెసర వంటి సాగుపై దృష్టి పెట్టాలని అంటున్నారు. దీనితో పాటు వేరుశనగ, నువ్వులు, ఆముదం వంటి నూనెగింజల సాగును చేపట్టాలని అంటున్నారు.

కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలి

వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



రైతులు విచ్చలవిడిగా కాంప్లెక్స్ ఎరువులను వాడుతున్నారు. దీని వల్ల భూసారం తగ్గిపోతుంది. అందువల్ల కాంప్లెక్స్ ఎరువులను వీలైనంత వరకు తగ్గించాలి. యూరియాను ఒకేసారి వాడకుండా దఫదఫాలుగా వాడాలి. గ్రామాల్లో ఎవరైనా దళారులు వచ్చి నాసిరకం ఎరువులు అమ్ముతామని చెబితే వ్యవసాయధికారులకు సమాచారం ఇవ్వాలి. ఏఈవోలు, ఏవోల సూచనల మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులను వాడాలి. రైతులకు సూచనలు ఇచ్చేందుకే ప్రతి క్లస్టర్‌లో ఏఈవోలు అందుబాటులో ఉన్నారు.

కావ్య గెలుపుతో కాంగ్రెస్ నాయకుల సంబరాలు


జఫర్‌గడ్‌లో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు


చిన్నపెండ్యాలలో సంబరాలు చేసుకుంటున్న పార్టీ శ్రేణులు

జఫర్‌గడ్, జూన్ 5: వరంగల్ ఎంపీగా కడియం కావ్య విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకున్నారు. బుధవారం జఫర్‌గడ్ గాంధీ సెంటర్‌లో ఆనందోత్సాహాలతో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. సీఎం రేవంత్, కడియంకు జై కొడుతూ పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఓటర్లు కాంగ్రెస్‌ను ఆదరించి గెలిపించి మోసపూరిత బీఆర్ఎస్, బీజేపీలకు గుణపాఠం చెప్పారన్నారు. పార్టీ శ్రేణులు కావ్య గెలుపు కోసం అహర్నిషలు కష్టపడి పని చేశారన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్యల నేతృత్వంలో జఫర్‌గడ్ మండలం అభివృద్ధి దిశలో పయనిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుదర్శన్, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, వైస్ చైర్మన్ ఎం.నర్సింగం, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌లు అన్నం బ్రహ్మారెడ్డి, అన్నెబోయిన భిక్షపతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడ్ల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: వరంగల్ ఎంపీగా కడియం కావ్య భారీ మెజారిటీతో గెలుపొందడం శుభపరిణామమని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, మాజీ సర్పంచ్ మామిడాల లింగారెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి చిన్నపెండ్యాల చౌరస్తాలో వివిధ గ్రామాలకు చెందిన నాయకులతో కలిసి వారు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ కడియం కావ్య నేతృత్వంలో నియోజకవర్గం అన్నిరంగాల్లో మరింతగా అభివృద్ధి చెందనుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భూక్య రమేష్‌నాయక్, మాజీ ఎంపీటీసీ తాళ్లపల్లి సంపత్, పాశం సురేశ్, మామిడాల యాదవరెడ్డి, ఎంపీటీసీ తాళ్లపల్లి ఉమ సమ్మయ్య, గడ్డమీది వెంకటస్వామి, ఏడవెళ్లి మల్లారెడ్డి, దేవి తిరుపతిరెడ్డి, మంతెన లవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ వీసీ అక్రమాలను బయటపెట్టాలి

ఫైళ్ల మాయంపై విచారణ కమిటీ వేయాలి

అకుట్ అధ్యక్ష, కార్యదర్శులు టి.శ్రీనివాస్, ఎం.ఇస్తారి

వరంగల్ ఎడ్యూకేషన్, జూన్ 5: మూడేళ్లలో అనేక అక్రమాలకు పాల్పడి, నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు చేసుకొని ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన కేయూ మాజీ వీసీ రమేశ్.. తనపై విజిలెన్స్ విచారణ జరుపబోతోందని తెలుసుకున్న వెంటనే ఫైళ్లను మాయం చేసి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అకుట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, డాక్టర్ మామిడాల ఇస్తారి ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ ఫైళ్ల తరలింపులో కొందరు సంబంధం లేని వ్యక్తుల ద్వారా జరిగిందని గతంలో అకుట్ ఆరోపించినా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి పట్టించుకోవడం లేదన్నారు. మాజీ వీసీకి వంతపాడుతూ ఇప్పటి వరకు సీసీ ఫుటేజ్ బయట పెట్టడం లేదని తెలిపారు. పదవీ కాలం చివరి నాలుగు రోజులు మాజీ వీసీ యూనివర్సిటీకి రాకున్నా కూడా అక్రమ బదిలీలు, పదవుల ఆర్డర్లపై పెట్టిన సంతకాలు ఎలా చెల్లుతాయని వారు ప్రశ్నించారు.

మూడేళ్లలో మాజీ వీసీ చేసిన అక్రమాలు బయటపడతాయనే భయంతో సంబంధం లేని వ్యక్తుల ద్వారా వీసీ లాడ్జీ నుంచి ఫైళ్లు మాయం చేయించారని తెలిపారు. ఇందుకోసం వీసీ లాడ్జిలో సీసీ కెమెరాలు కొన్ని రోజులకు ముందే పనిచేయకుండా చేసి క్రిమినల్ చర్యలు పాల్పడ్డారని ఆరోపించారు. మొదటి, రెండో గేటు వద్ద ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలకు సంబంధించిన డీవీఆర్‌లో నుంచి ఇప్పటి వరకు కెమెరా ఫుటేజ్ పరిశీలించకుండా కాలం వెల్లదీస్తున్నారని అన్నారు. వెంటనే సీసీ టీవీ ఫుటేజ్‌కు సంబంధించిన డివైజ్‌లను విజిలెన్స్ వారికి అప్పగించాలని, లేదా వాటిని పరిశీలించి ఫైళ్లను మాయం చేసిన వారిపై కేసులు పెట్టాలన్నారు. పరీక్షల విభాగంలో జవాబు పత్రాలను బయటకు తీసుకొచ్చినప్పుడు దినసరి వేతనం తీసుకునే ఉద్యోగులపై, అడ్డా లేబర్లపై సీసీ టీవీ ఫుటేజ్ పరిశీలించి కేసులు పెట్టిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి.. వీసీ చేసిన అక్రమాలను, వాటి సీసీ ఫుటేజ్ పరిశీలించకుండా ఎందుకు వెనుకేసుకొస్తున్నారో చెప్పాలన్నారు. వీసీ లాడ్జి నుంచి ఫైళ్లమాయం సంఘటనపై వెంటనే విచారణ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఉన్నత విద్యాశాఖ కార్యదర్శికి, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

అట్టహాసంగా ఉమెన్ టీ - 20 క్రికెట్ టోర్నీ

▸▸ ఆరు రాష్ట్రాల నుంచి 120మంది క్రీడాకారులు హాజరు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 5: తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ కేయూసీ క్రీడా మైదానంలో బుధవారం ఆల్ ఇండియా ఉమెన్ టీ-20 క్రికెట్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్రికెట్ టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున బాలికలు పాల్గొనడం అభినందనీయమని అన్నారు. క్రీడాకారులకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జయపాల్ మాట్లాడుతూ.. ఓపెన్ టూ ఆల్ బాలికల ఉమెన్ టీ -20 క్రికెట్ టోర్నీలో మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్, విదర్భా, హరియాణా, తెలంగాణ ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 100మంది క్రీడాకారులు, 20మంది కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ విజయచందర్‌రెడ్డి, కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సతీష్

హనుమకొండ టౌన్, జూన్5: తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్- 327 ఐఎన్‌టీయూసీ అనుబంధ జిల్లా రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్టిజన్ ఉద్యోగి చింతలపూడి సతీష్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం హనుమకొండ కార్యాలయంలో జరిగిన కమిటీ సమన్వయ సమావేశంలో యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ నుంచి సతీష్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సమావేశంలో కంపెనీ సెక్రటరీ శ్రీనువాస్, అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నీలం ఐలేశ్, పి.రాజిరెడ్డి, ఓదేలు, సదయ్య, బుచ్చయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



నీట్ ఫలితాల్లో శివాని విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న శివాని కళాశాల యాజమాన్యం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5: నీట్-2024 ఫలితాల్లో శివాని జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి తెలిపారు. సీహెచ్ సాత్విక 720 మార్కులకు 611, ఎస్.సాయిప్రియ 535, వి.భవాని 529, ఎన్.ప్రదీప్ 487, ఇ.కార్తీక్ 483, సీహెచ్.సాధ్విక 481, ఎల్.అనూష 481, బి.లోకేష్ 477, ఎం.ముఖేష్ 477, ఎస్.వర్షిత 448, కె.శివసాయి 443, ఎ.మనోజ్ 430, డి.కీర్తన 416 మార్కులు సాధించినట్లు వివరించారు. కొన్నేళ్లుగా కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ శివాని కళాశాల ఖ్యాతిని నిలబెడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను కరస్పాండెంట్ టి.స్వామి తోపాటు ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్, టి.రాజు, ఎన్.రమేశ్, ఎ.మురళి, వి.సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.

సీఎంను కలిసిన కడియం, కొమ్మూరి



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

జనగామ/స్టేషన్‌ఘన్‌పూర్, జూన్ 5: కడియం కావ్య వరంగల్ ఎంపీగా ఘన విజయం సాధించిన సందర్భంగా ఆమెతో పాటు ఎమ్మెల్యే కడియం శ్రీహరి బుధవారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ కడియం కావ్యకు అభినందనలు తెలిపి ఆమెను సత్కరించారు. కడియంతో పాటు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి సీఎంను కలిశారు.

ఎంపీ కావ్యను కలిసిన పొట్లపల్లి..


ఎంపీ కడియం కావ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పొట్లపల్లి శ్రీధర్‌రావు

చిలుపూర్: వరంగల్ ఎంపీగా భారీ మెజారిటీతో విజయం సాధించిన డాక్టర్ కడియం కావ్యను చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పల్లగుట్ట క్లస్టర్ ఇన్‌చార్జి పొట్లపల్లి శ్రీధర్‌రావు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హన్మకొండలోని ఎమ్మెల్యే కడియం నివాసంలో ఆమెను కలిసిన శ్రీధర్‌రావు పుష్పగుచ్ఛాన్నందజేశారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీహరిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపీగా కావ్య గెలుపుతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం మరింతగా అభివృద్ధి చెందనుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట డాక్టర్ చిర్ర సుమన్‌గౌడ్ ఉన్నారు.